అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

వంగర: రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బంగారువలస గ్రామంలో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. అందరూ బాగుండాలన్నదే సీఎం జగనన్న అభిమతమని ఆయన దానికోసం అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు చాలావరకు మెరుగయ్యాయన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. విద్యార్థులకు జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు అందజేస్తున్నారన్నారు. గ్రామాల్లోనే ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం)లు ఏర్పాటు చేసి, విత్తనం దగ్గర నుంచి పంట విక్రయం వరకు రైతులకు అండగా నిలిచారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ఇంటింటికీ వైద్యం అందేలా చూస్తున్నారన్నారు. నిరుపేదల సొంతింటి కల, నిరుద్యోగులకు సచివాలయ వ్యవస్థ ద్వారా ఉద్యోగాలు కల్పించారన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.లలితకుమారి శ్రీరామ్మూర్తి, ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుదర్శనరావు, వైస్ ఎంపీపీ కె.ఉమామహేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ ఎం.విజయలక్ష్మి గంగారావు, తహసీల్దార్ డి.ఐజాక్, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా 'సంక్షేమ' సంతోషం


మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

రామభద్రపురం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ సంతోషం నెలకొందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు తెలిపారు. మండల కేంద్రంలోని చొక్కాపు వీధిలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఇంటి పట్టాల సమస్యను ఆయన దృష్టికి తీసుకురాగా, దానిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రతీ హామీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారని, ఇప్పటివరకు దాదాపు 98 శాతం హామీలను నెరవేర్చారన్నారు. రాష్ట్రంలోని అమలులో ఉన్న పథకాలతో ఏదో ఒక పథకం రూపంలో ప్రతీ ఇంటికి లబ్ధి జరుగుతోందన్నారు. సమస్యలు లేని రాష్ట్రాన్ని తయారు చేయడమే ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. విభజన నాటి నుంచి ఉన్న సమస్యలు, ప్రస్తుత సమస్యలు ఒక్కో దాన్ని పరిష్కరించుకుంటూ అభివృద్ధి, సంక్షేమంపై దృష్టిసారిస్తున్నారన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, మళ్లీ సీఎం జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, జెడ్పీటీసీ ఎ.సరస్వతి, బొబ్బిలి మండల ఎంపీపీ ప్రతినిధి ఎస్.వేణుగోపాలనాయుడు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, మండల జేఏసీ చైర్మన్ సీహెచ్ సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులకు భూమిపూజ


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని 21, 26వ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు మంగళవారం భూమిపూజ చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడును ప్రజలు కొన్ని అభివృద్ధి పనులు చేయమని కోరారని, ఈ మేరకు ఆయన మంజూరు చేసిన రూ.17 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మరిపి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా నిలుపుదల


తాగునీటి పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి బుధవారం తాగునీటి సరఫరా నిలుపుదల చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల గ్రామంలోని పైపులైన్ మరమ్మతులకు గురైన కారణంగా దానిని బాగు చేయిస్తున్నామన్నారు. మంగళవారం ఈ మరమ్మతుల పనులను ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో మురుగునీరు లేకుండా నిరంతరాయంగా మంచినీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథయాత్ర ఉత్సవాలు ప్రారంభం


రథాన్ని లాగుతున్న భక్తులు

రాజాం సిటీ: స్థానిక బాబానగర్‌లోని సత్యసాయి శివం మందిరంలో 8వ రథయాత్ర ఉత్సవాలను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. పూరీ జగన్నాథస్వామి రథయాత్ర పురస్కరించుకుని, రథంలోకి బలరాముడు, జగన్నాథుడు, సుభద్రదేవిలను తోడ్కొని వచ్చి, పూజలు చేశారు. ఈ నెల 26వ తేదీ వరకు ఈ ఉత్సవాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాజేష్, కె.సాయిప్రశాంత్‌కుమార్, చంద్రావతి, ఏవీ ఆచారి, డీవీఎస్ శ్రీనివాస్, ఎస్.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం


గడిముడిదాంలో నిర్మిస్తున్న వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. మండలంలోని గడిముడిదాం గ్రామంలో నిర్మిస్తున్న వెల్‌నెస్ సెంటర్‌ను ఎంపీడీఓ బాసూరి శంకరరావు మంగళవారం పరిశీలించారు. మండలంలో మొత్తం 11 కేంద్రాలు నిర్మించాల్సి ఉండగా, ఐదు కేంద్రాల నిర్మాణం తుది దశకు చేరుకుందని, రెండు నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, పీఆర్ జేఈ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

భూముల రిజిస్ట్రేషన్లకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ అజురఫీజాన్

బాడంగి: రైతుల భూముల రిజిస్ట్రేషన్లు చేసేందుకు సిబ్బంది సిద్ధం కావాలని తహసీల్దార్ అజురఫీజాన్ సూచించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశమైన ఆయన భూముల వివరాలు, భూ యజమానుల పేర్లు, ఖాతా, సర్వే నంబర్లు, విస్తీర్ణం ఎలా సరిచూడాలో అవగాహన కల్పించారు. జూలై 1వ తేదీ నుంచి చేపట్టబోయే జగనన్న సురక్ష శిబిరాలు ద్వారా ప్రజలకు అవసరమైన సేవలు అందివ్వాలన్నారు. సమావేశంలో హెచ్‌డీటీ చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణం


గంగన్నపాడులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు


రాజాం: శ్మశానవాటికకు వెళ్లే దారిలో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

తెర్లాం: మండలంలోని గంగన్నపాడు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. దాదాపు రూ.5 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో రోడ్డు నిర్మిస్తున్నట్లు సర్పంచ్ కోట సరోజిని తెలిపారు. గ్రామంలో జరుగుతున్న ఈ నిర్మాణ పనులను పంచాయతీ కార్యదర్శి వినోద్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ కవిత మంగళవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని సూచించారు.

రాజాం: మండలంలోని ఇల్లంనాయుడువలస గ్రామంలో శ్మశానవాటికకు అనుసంధానిస్తూ సీసీ రోడ్డు నిర్మాణం మంగళవారం చేపట్టారు. రూ. 3 లక్షలు నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్ తెలిపారు. ఎంపీడీఓ బాసూరి శంకరరావు, పీఆర్ జేఈ ప్రభాకరరావు ఈ పనులను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని సూచించారు.

బాధ్యతల స్వీకరణ

బాడంగి: మండల పరిషత్ పరిపాలనాధికారిగా యు.రామలింగేశ్వరరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన రామభద్రపురం మండల పరిషత్ కార్యాలయం నుంచి ఏఓగా ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఏఓగా చేరి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా వ్యవహరించిన కె.అక్కారావు బదిలీపై రామభద్రపురం వెళ్లారు.

బాడంగి: ఎంఈఓ–2గా ఎం.రాజేశ్వరి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

నేడు ఆర్‌బీఐ క్విజ్ పోటీలు

బాడంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్‌బీఐ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ–2 ఎం.రాజేశ్వరి ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ పరీక్ష ఉంటుందని, ఒక్కో పాఠశాల నుంచి ఓ టీచరు, ఇద్దరు విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు కుమారుడు


విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

సంతకవిటి: కొన్నిరోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయిన మండలంలోని తలతంపర గ్రామానికి చెందిన విద్యార్థి దువ్వారపు మణికంఠను పోలీసులు అతడి తల్లిదండ్రులకు మంగళవారం అప్పగించారు. మణికంఠ శ్రీకాకుళం జిల్లాలోని సారవకోటలో ఉన్నట్లు గుర్తించి, అక్కడి వెళ్లి, విద్యార్థికి కౌన్సెలింగ్ ఇచ్చి నచ్చజెప్పినట్లు ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు తెలిపారు.

ప్రజారోగ్యానికే ప్రాధాన్యం


మహిళ ఆరోగ్యం వివరాలు అడిగి తెలుసుకుంటున్న వైద్యాధికారి సోహినీరాఘవ్

రేగిడి: ప్రజారోగ్యానికే ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సోహినీరాఘవ్ అన్నారు. మంగళవారం మండలంలోని వన్నలి గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి, పలువురికి ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. నిర్దేశిత వారంలో గ్రామానికి వచ్చే 104 వాహనంద్వారా 14 రకాల రోగ నిర్ధారక పరీక్షలతో పాటు 64 రకాల మందులు అందజేయడం జరుగుతోందన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం 104, 108 వాహన సేవలతో పాటు ఫ్యామిలీ డాక్టర్ సేవలను కూడా అందిస్తోందన్నారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ ప్రియా, ఏఎన్‌ఎం రాజేశ్వరి, సర్పంచ్ రమణ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బొబ్బిలి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా గురువు బిక్షమయ్య అన్నారు. మంగళవారం స్థానిక పట్టణంలోని శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో అంతర్ముఖ యోగ శిక్షణ శిబిరం నిర్వహించారు. యోగా గురువు మేశాపు చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఔత్సాహికులంతా పాల్గొని, పలు యోగాసనాలు నేర్చుకున్నారు.

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల ప్రదేశంలో వేతనదారులకు యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్, యోగా ఇన్‌స్ట్రక్టర్ కంబాల శైలజ మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయాన్నే యోగాసనాలు వేయాలని, ఇలా ప్రతిరోజూ చేయడం ద్వారా ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. కేవలం రెండు నిముషాలు ఆసనాలు వేస్తే చాలని, మానసిక ప్రశాంతత, ఆరోగ్యం లభిస్తుందన్నారు.

నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే గిట్టుబాటు వేతనం


రేగిడి: వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీఓ హరనాథరావు


రాజాం: గార్రాజుచీపురుపల్లిలో వేతనదారుల మస్టర్లు పరిశీలిస్తున్న ఏపీఓ సాయిరాం

రేగిడి: నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే గిట్టుబాటు వేతనం లభిస్తుందని ఏపీఓ ఎస్.హరనాథరావు అన్నారు. మండలంలోని సోమరాజుపేట గ్రామ మంచినీటి చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. కనీస వేతనం రావాలంటే రెండు పూటలా కొలతల ప్రకారం పనిచేయాలన్నారు. పనులు జరుగుతున్న చోట తాగునీరు, ప్రథమ చికిత్స కిట్, టెంట్లు ఉండేలా చూసుకోవాలన్నారు.

రాజాం: మండలంలోని ఆగూరు, గార్రాజుచీపురుపల్లి, దోసరి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ సాయిరాం పరిశీలించారు. రోజుకు రూ.272 వేతనం లభించేందుకు కొలతల ప్రకారం పనులు చేయాలని ఆయన సూచించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి


ర్యాలీలో మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద మాదకద్రవ్యాల నిషేధంపై అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలంతా ఖైనీ, గుట్కా, గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యపానం కూడా చేయకూడదన్నారు. ఈ మధ్యకాలంలో యువత, విద్యార్థులు చెడువ్యసనాల బారినపడి, జీవితం నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థుల నడవడికపై తల్లిదండ్రులు కూడా దృష్టిసారించాలని, చెడుమార్గంలో పయనించే వారిని సన్మార్గంలో నడపాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని కోరారు.

డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు..


రాజాం సిటీ: అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లీలావతి

రాజాం సిటీ: డ్రగ్స్‌కు బానిసలు కావద్దని యువత, విద్యార్థులకు ఎస్‌ఐ పి.నీలావతి సూచించారు. మంగళవారం స్థానిక ఓ ప్రైవేట్ కళాశాలలో విద్యార్థులకు మత్తుపదార్థాలు(డ్రగ్స్) తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకరిని చూసి మరొకరు మత్తుపదార్థాలు సేవించడం అలవాటు చేసుకుంటున్నారని, ఇది మంచిది కాదన్నారు. ఒకసారి చెడు అలవాట్ల బారినపడితే జీవితం నాశనం చేసుకున్నట్లేనన్నారు.

పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

- జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ విశ్వేశ్వరరావు


ఉద్దవోలులో పశుబీమా ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ విశ్వేశ్వరరావు

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ విశ్వేశ్వరరావు కోరారు. మంగళవారం మండలంలోని ఉద్దవోలు పశువైద్య కేంద్రం వద్ద పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో పశుబీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తమ వద్ద ఉన్న పశువులకు పశుబీమా చేయించుకోవాలని సూచించారు. ప్రమాదవశాత్తు అవి మరణిస్తే ప్రభుత్వమే పశుబీమా కింద నగదు చెల్లిస్తుందన్నారు. రైతుల వద్ద ఉన్న ఆవుకి మూడేళ్లకు రూ.397, గొర్రె, మేకలకు ఏడాదికి రూ.36 చొప్పున బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. పశుబీమా చేసిన పశువులు విద్యుత్ షాక్ గానీ, పిడుగుపాటుకు గానీ, మరే ఇతర కారణాలతో మరణిస్తే పశు బీమా పథకం వర్తిస్తుందన్నారు. అనంతరం 52 పశువులకు సంబంధించి, రైతులు బీమా నమోదు చేయించారు. రైతు భరోసా కేంద్రాల్లో పని చేస్తున్న గ్రామ పశు సంవర్ధక సహాయకులు గ్రామాల్లోని రైతుల వద్ద ఉన్న పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పశువుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు రైతులకు సలహాలు, సూచనలు అందివ్వాలన్నారు. సమావేశంలో పశు సంవర్ధక శాఖ బొబ్బిలి డిప్యూటీ డైరెక్టర్ నీలయ్య, తెర్లాం, బాడంగి మండలాల అదనపు డైరెక్టర్ నాగరాజు, నెమలాం పశు వైద్య కేంద్రం డాక్టర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పంపిణీ

రేగిడి: మండలంలోని వన్నలి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, అంబఖండి గ్రామాల్లోని రైతులకు పండ్ల మొక్కలు మంగళవారం పంపిణీ చేశారు. ఉద్యాన పంటల సాగులో భాగంగా ప్రభుత్వం అందజేసిన వీటిని అన్నదాతలకు ఉచితంగా అందజేసినట్లు ఏపీఓ ఎస్.హరనాథరావు తెలిపారు. మొక్కలు కావాల్సిన రైతులు ముందుగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఐదెకరాల లోపు పంట పొలాలు కలిగిన సన్న, చిన్నకారు రైతులకు బొప్పాయి, జామ, సపోటా, కొబ్బరి, జీడి మొక్కలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజాం సిటీ: మున్సిపాలిటీలోని 11 సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న 19 వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయాల వారీగా ఖాళీల వివరాలు వెల్లడించారు. బుచ్చెంపేట 2, పొనుగుటివలస 3, సత్యనారాయణపురం 1, మిర్తిరెడ్డి వీధి 2, లచ్చయ్యపేట(1) 4, లచ్చయ్యపేట(2) 1, మాదిగవీధి 1, ఆదర్శనగర్ 1, కొత్తవలస 2, కొండపేంట 2 చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 28వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామన్నారు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం


రాజాం: కంచరాంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు


మెంటాడ: రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు

రాజాం: రైతులకు అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని కంచరాం సర్పంచ్ గెడ్డాపు సుబ్బమ్మ అన్నారు. మండలంలోని కంచరాం గ్రామంలో రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు మంగళవారం విత్తనాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో విత్తనాల కోసం రైతులు మండల కేంద్రాలకు పరుగులు పెట్టేవారని, క్యూలో రోజుల తరబడి నిల్చునేవారన్నారు. రైతు కష్టాలను తెలిసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆర్‌బీకేలను అందుబాటులోకి తీసుకువచ్చి, విత్తనాలు దగ్గర నుంచి పంట విక్రయించుకునే వరకు అన్ని సదుపాయాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ జి.అప్పలనాయుడు, ఎంపీటీసీ రాంబాబు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు నిఖిల్, నవ్యలు, రైతులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని 17 ఆర్‌బీకేల్లో రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి కె.శిరీష తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆమె ఇప్పటికే రైతులకు విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. గిడ్డంగి సదుపాయాలున్న 10 ఆర్‌బీకేల్లో ముందస్తుగా యూరియా, డీఏపీ తెచ్చి, ఉంచామన్నారు. వరి విత్తనాలు 1080 క్వింటాళ్లు అవసరం కాగా ఇప్పటికి 590 క్వింటాళ్లు వచ్చాయన్నారు. అలాగే యూరియా 157 మెట్రిక్ టన్నులు, డీఏపీ 132 మెట్రిక్ టన్నులు ఉన్నాయన్నారు.

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకున్న వారికి తొలుత విత్తనాలు అందజేస్తున్నామని మండల వ్యవసాయాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు.

మెంటాడ: మండలంలోని ఇద్దనవలస గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు పక్షపాతి అని, రాయితీపై రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న ఎరువులు, విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్.ఈశ్వరరావు, సర్పంచ్ ఆర్.రామారావు తదితరులు పాల్గొన్నారు.